విమలను గెలిపించుకుందాం

విశాలాంధ్ర - మల్కాపురం: ఇండియా కూటమి విశాఖ పశ్చిమ నియోజకవర్గం సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల విజయానికి కంకి కొడవలి గుర్తుకి ఓట్లు వేసి గెలిపించాలని పారిశ్రామిక ప్రాంతంలో ముమ్మర ప్రచారం చేపట్టారు. శ్రీహరిపురం ఇంద్ర నగర్ కాలనీ 1, 2, ధర్మ కాలనీ ఎంఐజి 1, 2 ప్రాంతాల్లో ఇంటింటికి ప్రచారం చేపట్టారు. ఇండియా కూటమి బలపరిచిన పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విమలను గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, సిపిఐ నాయకులు డి.గోపాలరావు, మహిళా సమాఖ్య నాయకురాలు పాల్గొన్నారు.

విమలకు నీరా'జనం'

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ పశ్చిమ నియోజకవర్గ సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల విజయాన్ని కాంక్షిస్తూ పారిశ్రామిక ప్రాంతం, గోపాలపట్నం, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. సీపీఎం, కాంగ్రెస్, భారత్ బచావో, మహిళా, విద్యార్థి, యువజన సంఘాలు బలపరిచిన సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలను కంకి కొడవలి గుర్తుపై ఓట్లు వేసి అసెంబ్లీకి పంపాలని, పేద ప్రజల తరుపున పని చేసే అవకాశం కల్పించాలని ఇంటింటా ప్రచారం ముమ్మరం చేశారు. పరిశ్రమల మనుగడకు వామపక్ష

కూటమి అభ్యర్థుల విజయం అనివార్యమని పేర్కొంటూ ఇండియా కూటమి అభ్యర్థులు గెలిస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రచారం చేశారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ గతంలో వైసీపీ చేసిన వాగ్దానాల అమలులో వైఫల్యాల తీరును ఓటర్లకు విన్నవిస్తూ ముందుకు సాగారు. గోపాలపట్నం ఏరియా ఇందిరా ప్రియదర్శిని కాలనీ, భరత్ నగర్, మాజీ సర్వీస్ మెన్ కాలనీ, నెహ్రూనగర్, లేబర్ కాలనీ ప్రాంతాల్లో దళాలుగా ఏర్పడి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ నేతలు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్కె రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, గుడాల రాంబాబు, పి.చంద్రశేఖర్, డి.గోపి తదితర పార్టీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ: కలెక్టర్ మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో నామినేషన్ల ప్రక్రియను పూర్తి పారదర్శక విధానాల మధ్య అత్యంత విజయవంతంగా నిర్వహించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున పేర్కొన్నారు. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల అనంతరం విశాఖ లోక్ సభ స్థానంలో 33 మంది, అసెంబ్లీల బరిలో 101 మంది వెరసి మొత్తం 134 మంది పోటీలో ఉంటున్నారని తెలిపారు. మే 13న జరిగే పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలింగ్ పర్సనల్, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో నిర్వహించామని వెల్లడించారు. జాయింట్ పోలీసు కమిషనర్ ఎస్.ఫక్కీరప్పతో కలిసి మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నామని దానిలో భాగంగా ఇప్పటి వరకు వస్తు, ధన రూపేణా రూ.13.41 కోట్ల నగదును జప్తు చేశామని తెలిపారు. నియమావళి ఉల్లంఘనకు సంబంధించి 82 ఘటనల్లో కేసులు నమోదు చేశామని, నిబంధనలు అతిక్రమించిన 71 ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామని, 28 మందిపై ఎఫ్.ఐ.ఆర్.లు నమోదు చేశామని వివరించారు. జిల్లాలో 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు, 40 శాతం అంగవైకల్యం పైబడిన వారికి మే 7, 8వ తేదీల్లో హెూం ఓటింగ్ నిర్వహిస్తామని, ఒక వేళ ఆ

రెండు తేదీల్లో ఎవరైనా మిగిలిపోతే మే 9వ తేదీన మరొకసారి అవకాశం కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 1,523 మంది హెూం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

మే 5, 6, 7, 8వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే అధికారులకు, సిబ్బందికి మే 5, 6, 7వ తేదీల్లో ఆంధ్రా యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. మే నెల 7, 8 తేదీల్లో పోలీసు, రవాణా, ఇతర ఎసెన్షియల్ సర్వీసెస్ విభాగాలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా ఓటింగ్ ఉంటుందని స్పష్టం చేశారు. మొత్తం 11,221 మంది దరఖాస్తు చేసుకున్నారని, సంబంధిత ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

రజకుల సమస్య పరిష్కరిస్తా

జై భారత్ అభ్యర్థి లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఉత్తర నియోజక వర్గ జై భారత్ పార్టీ అభ్యర్థి వివి లక్ష్మీనారాయణ 26వ వార్డ్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజల నుండి విశేష మద్దతు లభించింది. స్థానిక ప్రజలు తమ సమస్యల గురించి ఆయనకు తెలియ జేశారు. ముఖ్యంగా చాకలి పేటలో తాము పడుతున్న ఇబ్బందుల గురించి తెలియజేయగా ఆయన తాను నెగ్గిన వెంటనే వచ్చి మీ సమస్యను పరిష్కరిస్తానని, టెక్నాలజీ డవలప్ అయిన ఈ రోజులలో కూడా మీరు చేతులతో బట్టలు ఉతకడం దురదృష్టకరం అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన మీకు ఈ దుస్థితి దాపురించిందన్నారు. మీ స్థితి గతులు మార్చవలసిన అవసరం ఉందన్నారు. తదనంతరం లలితనగర్ కాలనీలోని సుమారు 40 మంది యువకులు జేడీ అభిమానులు జేడీ సమక్షంలో జై భారత్ పార్టీలో జాయిన్ అయ్యారు.

దక్షిణం ఈవిఎంల ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఈవిఎంల ర్యాండమైజేషన్ పూర్త యింది. జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున పర్యవేక్షణలో చినగదిలిలోని ఈవిఎంల గొడాము వద్ద వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ కార్యక్రమం మంగళవారం ఉదయం జరిగింది. ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తికావడంతో దక్షిణ నియోజకవర్గ బరిలో 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమని ఎన్నికల అధికారులు అంచనా వేశారు. ఈ నెల 12,13న నిర్వహించిన మొదటి ర్యాండమైజేషన్ కార్యక్రమంలో ప్రతి పోలింగ్ స్టేషనుకు ఒక బ్యాలెట్ యూనిట్ అవసరమని తొలుత భావించినప్పటికీ, ప్రస్తుతం దక్షిణ నియోజకవర్గంలో రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం కానుండటంతో 20 శాతం రిజర్వుతో కలిపి 284 బ్యాలెట్ యూనిట్లు అవసరమని ఎన్నికల అధికారులు భావించారు. ఇందుకు సంబంధించి చినగదిలి ఈవిఎం గొడాములో రిజర్వులో నుంచిన బ్యాలెట్ యూనిట్ల నుంచి దక్షిణ నియోజకవర్గానికి అవసరమైన ఈవిఎంలను పొందేందుకు సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరుతో పాటు ఈవిఎంల నోడల్ అధికారి టి.ప్రవీణ, దక్షిణ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తాం

- గాజువాక అసెంబ్లీ అభ్యర్థి అమర్నాథ్

విశాలాంధ్ర - గాజువాక: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గడిచిన ఐదు సంవత్సరాలలో ఎంతో మేలు చేశారని రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ తెలియజేశారు. గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ నాయి బ్రాహ్మణుల సేవా సంఘం సమావేశం మింది కళ్యాణ మండపంలో జరిగింది. నాయి బ్రాహ్మణుల కళ్యాణ మండపం కోసం షీలానగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీపంలో శంకుస్థాపన చేశామని, అయితే కొన్ని అడ్డంకుల వలన ఆ నిర్మాణం నిలిచిపోయిందని అమర్నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కళ్యాణ మండప నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ప్రతి దేవస్థానంలోనూ నాయి బ్రాహ్మణులకు సంబంధించిన పోస్ట్ ఉండే విధంగా జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని మంత్రి అమర్నాథ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాయి బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తామని ఆయన ప్రకటించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మీద, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వనని, గాజువాక నియోజకవర్గంలో ఈ సామాజిక వర్గానికి చెందిన వారంతా తన విజయానికి సహకరించాలని అమర్నాథ్ విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ ఉరుకూటి చందు, అడవివరం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీధర్, కే.గోవింద్, వడ్లపూడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ వారాహి సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పెందుర్తి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మే 1న పెందుర్తి కూడలిలో నిర్వహించే వారాహి సభను విజయవంతం చేయాలని ఎన్డీఏ కూటమి నాయకులు టిడిపి, బిజెపి, జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు. సుజాతనగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సోదరులు రాజేష్, శ్రీనివాస్ నాయుడు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జనసేన నాయకులు పిన్నింటి పార్వతి, సేనాపతి సోమశేఖర్, కంచిపాటి మధు, జనార్ధన్ తదితరులు పాల్గొని పవన్ కళ్యాణ్ సభ ఏర్పాట్లు, విజయవంతంపై చర్చించారు. బిజెపి, టిడిపి, జనసేన నాయకు లందరూ కష్టపడి సభను విజయవంతం చేయాలని సూచించారు. సభలో అధికార పార్టీ నాయకులు కుట్రలు చేసే

అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే సభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా కృషి చేయాలని కోరారు.

బాపూజీ విద్యాలయం వార్షికోత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: దిబ్బపాలెం బాపూజీ విద్యాలయం స్థాపించి 30 సం. లు పూర్తి అయిన సందర్భంగా 30 వసంతాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జెడి) బి.విజయ భాస్కర్ పాల్గొని ప్రసంగించారు. పిల్లలకు ఇల్లే ప్రథమ పాఠశాల అని, తల్లిదండ్రులే ప్రథమ గురువులని, కావునా తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లలను ప్రేమగా చూస్తూ, ఎవరిని కించపరచకుండా, ప్రోత్సహిస్తూ చదువులు చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా మండల విద్యా శాఖాధికారులు రమనాజీ, విశ్వనాథంలచే యూకేజీ చిన్నారులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ వార్షికోత్సవంలో పాఠశాల కరెస్పాండెంట్లు వెంకట నాయుడు, సత్యన్నారాయణ, ప్రిన్సిపాల్ శోభారాణి, జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, రాము, వాసుదేవరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముత్తంశెట్టితోనే భీమిలి అభివృద్ధి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: భీమిలిలో సమగ్ర అభివృద్ధి జరగాలంటే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతోనే సాధ్యమవుతుందని సినీనటి శ్యామల అన్నారు. భీమిలి వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 48వ వార్డు ఎన్నికల ప్రచార కార్యక్రమం వార్డు కార్పొరేటర్ కంపా హనుక్ ఆధ్వర్యంలో సాగింది. సినీ నటి, టీవి యాంకర్ శ్యామల 48వ వార్డులో గడప గడపకు వెళ్ళి ఫ్యాన్ గుర్తు పై ఓటేసి అవంతిని ఎమ్మెల్యేగా, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్సా ఝాన్సీని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. భీమిలి హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చెందాలంటే అవంతి శ్రీనివాస్ ద్వారానే సాధ్యమవుతుంది అన్నారు. ఆయన నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తారని తెలిపారు. అనంతరం అవంతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పాలనకు వైసిపి ప్రభుత్వంలో జగనన్న అందించిన పాలనకు మధ్య వ్యత్యాసం మీకే బాగా తెలుసునని, గత ప్రభుత్వాలు పాలన మాదిరిగా వైసిపి పాలనలో లంచాలు లేవన్నారు. మరోసారి వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: ఎంవీవీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రతి గడపగడపకు సంక్షేమం అభివృద్ధి అందాలన్నా, అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా అది జగనన్న ప్రభుత్వంతోనే సాధ్యమని వైసీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు 99వరోజు మంగళవారం స్థానిక జీవీఎంసీ 12వ వార్డ్ అక్కరమాని రోహిణి రామన్ ఆధ్వర్యంలో టీ ఐసి పాయింట్, క్రాంతినగర్, విద్యానగర్, నెహ్రూ నగర్ జ్యోతి నగర్ దుర్గా నగర్, బీసీ కాలనీ, న్యూ శాంతినగర్, చిన గదిలి, పెద గదిలి ప్రాంతాలలో విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించి గడపగడపకు వెళ్లి జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు కరపత్రాలు ఇచ్చి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సంక్షేమ సారధి జగనన్నను మరల ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి తూర్పు నియోజకవర్గం అభివృద్ధి మార్పు కొరకు దోహదపడాలన్నారు.

నిధులు దోచుకున్న వైసీపీకి ఓటు వేయొద్దు: భాగం

విశాలాంధ్ర - భీమిలి: ఎస్సీ నిధులు దోచుకుతిన్న వైసీపీకి ఓటు వేయొద్దని భీమిలి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి భాగం గోపాల్‌రావు అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.26వేల కోట్లు వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించి ఎస్సీ, ఎస్టీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మూడు రకాలుగా మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లుగా విభజించి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి ఎస్సీలకు ఐదేళ్లలో ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఎస్సీలకు పెళ్లి కానుక రద్దు చేసిందన్నారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలైనా దళితులకు ఆర్థికంగా, సామాజికంగా న్యాయం నేటికీ జరగలేదని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 4 ఎంపీలు, 29 ఎమ్మెల్యేలు ఉన్నా దళితులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించకపోవడం విడ్డూరమన్నారు. ఈ ఎన్నికల్లో తనకు ఏనుగు గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పారుపల్లి నర్సింగరావు, పట్టా ఈశ్వరరావు, గంధవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొట్నూరులో గంటా రవితేజ ప్రచారం

విశాలాంధ్ర - పద్మనాభం: రాబోయేది మహిళ అభ్యున్నతికి కట్టుబడి ఉండే మహిళా పక్షపాతి ప్రభుత్వమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ భరోసా ఇచ్చారు. మంగళవారం పద్మనాభం మండలం పొట్నూరు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్‌లో మహిళల కోసం రూపొందించిన పథకాలను వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ళ నిండిన మహిళలకు ప్రతి నెల 1,500 భృతి, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలుంటే అన్ని 15 వేల రూపాయలు, పెళ్లి కానుక కింద లక్ష రూపాయలు అందజేస్తామని ఆయా పథకాలపై అవగాహన కల్పించారు. మహిళల డ్వాక్రా పథకాన్ని రూపశిల్పి చంద్రబాబు ఆర్థిక స్వావలంబన కల్పించారని రవితేజ అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్.పి.టి.సి. దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు కె.రమణ, మాజీ ఎంపీపీలు లీలావతి, కాళ్ల నగేష్ కుమార్, మజ్జి నందీశ్వరరావు, మాజీ సర్పంచ్ మజ్జి శ్రీనివాస్, వి.సురేష్, కాళ్ల సత్యన్నారాయణ, కె.ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పోరు ప్రచారంలో దూసుకు వెళ్తున్న బొత్స ఝాన్సీ లక్ష్మి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: బ్యాలెట్ వరుసలోనూ నెంబర్ 1గా బొత్స ఝాన్సీ నిలిచారు. విశాఖ పార్లమెంటు స్థానానికి వైస్సార్సీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి ఫ్యాన్ గుర్తుపై పోటీ చేస్తున్నారు. ఈమెకి బ్యాలెట్ వరుసలో నెంబర్ వన్ స్థానం కేటాయించారు. ముప్పై ముగ్గురు ఎన్నికల బరిలో నిలవగా ఈ వి ఎం మెషిన్‌లో నెంబర్ 1 సంఖ్యను ఝాన్సీ లక్ష్మి అభ్యర్థిత్వానికి ఫ్యాన్ గుర్తుగా కేటాయించారు. ఝాన్సీలక్ష్మి ఒకటో నెంబర్‌ను అదృష్టానికి ప్రతీకగా భావిస్తారు. బ్యాలెట్ బరిలో తొలి స్థానాన్ని దక్కించుకోవడాన్ని వైసీపీ శ్రేణులు శుభ సంకేతంగా భావిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

లైబ్రేరియన్ ఝాన్సీ రత్నాబాయి సేవలు ఆదర్శనీయం

సమాచార శాఖ ఆర్జేడీ వి.మణిరామ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర సమాచార కేంద్రంలో సుదీర్ఘకాలం లైబ్రేరియన్‌గా ఎనలేని సేవలు అందించిన డి.ఝాన్సీ రత్నాబాయి సమాచార కేంద్రానికి, సమాచార శాఖకు మంచి గుర్తింపు తెచ్చారని ఆర్.జే.డి. వి.మణిరామ్ ప్రశంసించారు. మంగళవారం సమాచార కేంద్రంలో నిర్వహించిన ఝాన్సీరత్నాబాయి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. 32 సం.ల సర్వీసులో ఆమె ఎల్లప్పుడూ సంయమనంతో విధులు నిర్వహించే వారని తెలిపారు. విశాఖలో ఆర్.టి.సి. కాంప్లెక్స్‌లో రాష్ట్ర సమాచార కేంద్రం వున్న సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం, డాక్టరేట్ చేసేవారికి, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి అవసరమైన విజ్ఞాన గ్రంథాలు, చారిత్రక, సామాజిక, విషయాలకు సంబంధించిన సమాచారాన్ని, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో వుంచి అందరి మన్ననలను పొందారని తెలిపారు. ఆమె మౌనంగానే తన విధులను నిర్వర్తిస్తూ అవసరమైన వారికి విజ్ఞాన విషయాలను అందజేయడం ఆమె నైజమని కొనియాడారు.

విశ్రాంత జె.డి. పైడి గోవిందరావు మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరి అని, రాష్ట్ర సమాచార కేంద్రంలో ఎంతో మంది అధికారుల వద్ద విధులు నిర్వర్తించి వారందరి మన్ననలను ఝాన్సీ పొందారని కొనియాడారు. విశ్రాంత ఆర్డీడీ ఆర్.త్యాగరాజు, విశ్రాంత ప్రాంతీయ సమాచార ఇంజనీరు వి.వెంకటప్పారావు, విశ్రాంత ఉప సంచాల కులు ఎ.బాబ్జి ఈ సందర్భంగా ఝాన్సీ సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉప సంచాలకులు ఎస్.వి.రమణ, విజయ నగరం ఏడి డి.రమేష్, అనకాపల్లి డిపిఆర్‌వో డి.సాయి బాబా, పర్యవేక్షకులు జి.వి.ఎస్.ప్రసాదు తదితరులు ఝాన్సీ విధుల పట్ల చూపించిన అంకిత భావాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం లైబ్రేరియన్ ఝాన్సీ రత్నాబాయి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, విజయనగరం, పాడేరు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల సమాచార శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

భీమిలి స్వతంత్ర అభ్యర్థి నాగోతు ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాగోతి నాగమణి బకెట్ గుర్తుపై ఓటు వేసి తనని గెలిపించాలని ప్రచారం చేపట్టారు. విద్యావంతురాలైన ఆమె గత ఐదు నెలలుగా ప్రజా పరిచయ కార్యక్రమం ద్వారా నియోజకవర్గమంతా చుట్టు ముట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి తనను తాను పరిచయం చేసుకొని ఎనలేని అభిమానం పొందారు. అయితే ఇప్పుడు ఆమెకు ఎలక్షన్ కమిషనర్ బకెట్ గుర్తు ఇవ్వడంతో నాగమణి మరింత జోరు పెంచారు. ఇందులో భాగంగా మంగళవారం ఆమె ఆనందపురం మండలంలోని సొంట్యం, దిబ్బ మీద పాలెం, గొంతినవానిపాలెం, గండిగుండం గ్రామాల్లో ఆమె మండే ఎండను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం చేశారు. నాగోతి నాగమణి మాట్లాడుతూ ఎన్నికల రూపంలో ప్రజలను కలుసుకోవడం మధురానుభూతిగా ఉందన్నారు. తనకు ఓటు వేసి గెలిపించినట్లయితే భీమిలి నియోజకవర్గంను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.10 కోట్లు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహాలక్ష్మీ నృసింహ స్వామివారి హుండీ ఆదాయం రూ.2,10,60,286లు నగదు లభించింది. భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కుబడులుగా హుండీలో బంగారం 000.104.100 మిల్లి గ్రాములు, వెండి 15 కెజిల 450 మిల్లి గ్రాములు, యు.ఎస్.ఏ 126, ఇంగ్లాండ్ 75 డాలర్లు, యు.ఏ.ఈ 130, మలేషియా 18 డాలర్లు, కెనడా 120 డాలర్స్, ఖతార్ 10 దిరామ్స్ సౌదీ 2 దినార్స్, నేపాల్ 120 రూపాయిలు, ఆస్ట్రేలియా 20 డాలర్లు, శ్రీలంక 100 రూపాయిలు కరెన్సీ భక్తులు సమర్పిం చినట్లు కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. హుండి లెక్కింపులో దేవస్థానం సిబ్బందితో పాటు శ్రీహరి, శ్రీవారి సేవా సంస్థలు పాల్గొన్నాయి.

పోలింగ్ సిబ్బంది
రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ మేరకు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, గాజువాక, పశ్చిమ, ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సీతారామ్ జాట్ సమక్షంలో జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీసీ హాలులో ఆన్లైన్ విధానంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. విశాఖపట్టణం పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాల ఉండగా ఆయా పోలింగ్ కేంద్రాలకు సరిపడా సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ అధికారులకు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలుగా మొత్తం 12,626 మందికి విధులు కేటాయించారు. సంబంధిత నమూనా ఆర్డర్ కాపీలను పరిశీలకులకు చూపించారు. జిల్లాలో మొత్తం 1991 పోలింగ్ కేంద్రాలు ఉండగా 10 శాతం అదనపు సిబ్బంది కేటాయింపు నిబంధనను అనుసరించి వాటికి సరిపడా 2,184 మంది పీవోలను, 2,193 మంది ఏపీవోలను కేటాయిస్తూ మంగళవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 800కి లోపు ఉంటే ముగ్గురు, 800 దాటితో నలుగురు ఓపీవోలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం మేరకు 7,361 మంది ఓపీవోల అవసరం కాగా పది శాతం అదనపు సిబ్బంది కేటాయింపు నిబంధన మేరకు 8,249 ఓపీవోలను కేటాయించారు. భీమిలిలో 359, తూర్పులో 293, దక్షిణంలో 237, ఉత్తరంలో 275, పశ్చిమంలో 222, గాజువాకలో 306, పెందుర్తిలో 299 పోలింగ్ కేంద్రాలు ఉండగా అదే సంఖ్యను అనుసరిస్తూ పీవోలను, ఏపీవోల కేటాయింపు ప్రక్రియ జరిగింది. 800కి లోపు ఓటర్లున్న చోట కేంద్రానికి ముగ్గురు, 800కి దాటిన చోట కేంద్రానికి నలుగురు చొప్పున ఓపీవోలను కేటాయిస్తూ మంగళవారం జరిగిన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రిజర్వ్ సిబ్బందిని కూడా కేటాయించారు. ఈ మేరకు సంబంధిత ఆర్డర్ కాపీలను సిబ్బందికి అందజేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీరందరికీ మే నెల 5, 6వ తేదీల్లో నిర్దేశించిన ప్రాంతాల్లో శిక్షణ ఉంటుందని, అందరూ శిక్షణ శిబిరాలకు హాజరుకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఎన్.ఐ.సి. అధికారులు చంద్రశేఖర్, పాషా, కలెక్టరేట్ ఏవో దేవ్ ప్రసాద్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆనాడు ఎన్టీఆర్, నేడు నరేంద్ర మోడీ సంక్షేమరథ సారధులు

విశాలాంధ్ర - పెందుర్తి: ఆనాడు పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించే లక్ష్యంతో ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని, నేడు నరేంద్ర మోడీ పేదల కోసం అనేక పథకాలు అమలు చేసి సంక్షేమ రంగ సారదిగా చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయారని ఎన్డీఏ నాయకులు పేర్కొన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు సతీమణి మహాలక్ష్మి, నియోజకవర్గం బిజెపి కన్వీనర్ గొర్లె రామునాయుడు, అనకాపల్లి సీఎం రమేష్ నాయుడు కుటుంబ సభ్యులు పెందుర్తి మండలం రాంపురం, కోట్నీవానిపాలెం, గొరపల్లి, సరిపల్లి గ్రామాలలో పర్యటించి ఉపాధి హామీ కూలీలను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా సీఎం రమేష్ నాయుడును, గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి పంచకర్ల రమేష్ బాబుని ఎమ్మెల్యే గాను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి, రామునాయుడు మాట్లాడుతూ పేదలందరికీ ఉచిత రేషన్, ఆయుష్మాన్ భవ ద్వారా ఐదు లక్షలు వైద్య సదుపాయం, ఇంటింటికి తాగునీరు, ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి పేదలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడం, మౌలిక వసతుల కల్పన ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు వంటి పథకాలు అమలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సంక్షేమ రంగానికి చిరునామాగా నిలిచిపోయారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు తన స్టిక్కర్లు అంటించుకుని ప్రజలను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రమేష్ ఎంపీగా వస్తే అనకాపల్లి జిల్లా అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు.

గంటా పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 3వ వార్డులో ఈనెల 2వ తేది గురువారం భీమిలి నియోజకవర్గం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రజలకు విజ్ఞప్తి చేసారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం గంటా నూకరాజు అధ్యక్షతన కూటమి నాయకులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు పర్యటనపై రూట్ మేప్ గురించి వివరించారు. ముందుగా భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకొని అక్కడనుండి మెయిన్ రోడ్డు, బోయవీధి, ఎగువపేట, నేరెళ్లవలస, గొల్లవీధి, చిన్నబజార్, తోటవీధి, రెల్లివీధి మీదుగా గొల్లలపాలెం వరకు ప్రచారం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. గంటా శ్రీనివాసరావుని భీమిలి అభ్యర్థిగా ప్రకటించినరోజే విజయం ఖాయమని భీమిలి ప్రజలు నిర్ణయించారని అన్నారు. అభివృద్ధికి చిరునామా అయిన గంటాని అత్యధిక మెజారిటీతో గెలిపించి అధినేత నారా చంద్రబాబు నాయుడుకి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కంటుబుక్త రామానాయుడు, కంటుబుక్త సునీత, జనసేన నాయకులు అక్కరమాని దివాకర్ తరపున ప్రతినిధులు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు శంకర్, చురకల రమణ, మారోజు సత్యవర ప్రసాద్, గొలగాని నరేంద్రకుమార్, మారోజు సంజీవకుమార్, పెంటపల్లి యోగీశ్వరరావు, కనకల అప్పలనాయుడు, కాసరపు ఎల్లాజీ, అప్పికొండ నూకరాజు, షేక్ అన్వార్, కొక్కిరి అప్పన్న, వాడమొదలు సత్యారావు, కంచెర్ల కామేష్, గండిబోయిన పోలిరాజు, వియ్యపు పోతురాజు, ఆవాల సూరిబాబు, జలగడుగుల మురళి, నెక్కెళ్ళ వెంకటరావు, రాజగిరి రమణ, కొక్కిరి కిషోర్, కొక్కిరి వీర్రాజు, పిళ్ళా తాతారావు, కొక్కిరి నూకరాజు, అల్లిపిల్లి సతీష్, శంకర్, వాసుపల్లి వంశీ, వాడమొదలు రాంబాబు, కారి పరదేశి, గాదు ఆనంద్, మట్టా దాసు, చింతపల్లి చరణ్, చింతకాయల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో వైసీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్థానిక జీవీఎంసీ 19వ వార్డ్ వైసీపీ ఇన్చార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్ సమక్షంలో మంగళవారం తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో 22, 23 వార్డుల నుండి పాత రేసావాని పాలెం, కొత్త రేశావాని పాలెం ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీ నుండి వైసిపి పార్టీలోకి పలువురు యువకులు చేరారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వి సత్యనారాయణ వారికి వైసీపీ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డిలి చేస్తున్న సంక్షేమం అభివృద్ధి చూసి వైసీపీ పార్టీలోకి రావడం హర్షణీయమని అన్నారు. కార్యక్రములో రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, సూరడా ఈశ్వర్ పార్టీ శ్రేణులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న అభివృద్ధిని చూసి వైసివి పార్టీలోకి చేరిక

విశాఖ తూర్పు నియోజకవర్గం స్థానిక జీవీఎంసీ 11,13వ వార్డులలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన పలువురు యువనాయకులు, మహిళలు 150 మందికి పైగా యువ నాయకులు, మహిళలు లాసన్సబే కాలనీ, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో మంగళవారం టీడీపీ నుండి, వైసిపి పార్టీలో వైసిపి నాయకులు గంపల వెంకట రామచంద్ర రావు సమక్షంలో చేరారు. వీరికి ఎంవీవీ సత్యనారాయణ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి వార్డులో ఉన్న స్థానికులు వైసీపీ పార్టీలోకి రావడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గంపల వెంకట రామచంద్రరావు, సిహెచ్ దాస్, కిరణ్మయి, చరణ్ అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమరేశ్వర్ హత్య కేసులో వైసీపీ నేతను అరెస్టు చేయకపోవడం అన్యాయం

కూటమి నేతలు మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎక్కడ చుసిన అరాచకాలు, హత్య రాజకీయాలు నిత్యం జరుగుతు న్నాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. మంగళవారం విశాఖ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరిలోవలోని దళిత యువకుడు అమరేశ్వర్పై జరిగిన దారుణం విషయంలో కనీసం చర్యలు తీసుకోకపోవడం సరికాదు అన్నారు. వైసీపీ నేతగా చలామణి అవుతున్న ఓ మహిళ దళిత యువకుడ్ని ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి అతని నుండి డబ్బు తీసుకొని, మరికొంత మందిని చేరిస్తే వారికి కూడా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సుమారుగా మూడు కోట్లు రూపాయలు వసూలు చేసుకొని, తీరా ఉద్యోగం ఇవ్వకుండా, ఇబ్బంది పెట్టి అక్రమ సంబంధం అని చెప్పి హత్య చేసి నడి రోడ్డుపై పడేసారని మండిపడ్డారు. అధికారం ఉంది కదా అని పోలీసులను అడ్డు పెట్టుకొని ఈ హత్యను మరో కోణంలో మార్చేలా చేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయకపోతే డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. దళిత యువకుడు అమరేశ్వర్ను సినీ పక్కిలో వైసిపి నేతలు రాళ్లతో కొట్టి చంపేశారని ఆరోపించారు. నేరం చేసింది వైసిపి మహిళ నాయకురాలని పదేపదే చెప్తున్నా నేటికీ పోలీసులు ఆమెపై కనీస చర్యలు తీసుకోలేదని, ఈ కేసు విషయంలో ఆమెకు సహకరిస్తున్న విశాఖ ఎంపీ సత్యనారాయణతో పాటు ఆయన అనుచరుల పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి నేత పోతన రెడ్డి, బిజెపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి మురళీమోహన్ రాజు, జనసేన పార్టీ నాయకులు నాగలక్ష్మి, పోతు వెంకటప్రసాద్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జుట్టు కోసం డై హెయిర్ మాస్క్

విశాలాంధ్ర - విశాఖపట్నం : వేసవి కాలంలో తేమ, కాలుష్యం తదితర హానికరమైన ప్రభావాల నుంచి మీ జుట్టును రక్షించే డై హెయిర్ మాస్క్ ఎంత అవసరమని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలుష్య కారకాల కలయిక తరచూ నిస్తేజంగా, పొడిగా ఉండే, చింపిరి జుట్టుకు దారితీస్తుందన్నారు. కఠిన జలాల (హార్డ్ వాటర్)కు ఎక్కువగా గురి కావడం వల్ల నష్టం మరింత తీవ్రమవుతుంది. అది మీ జుట్టును నిస్తేజంగా, చిట్లి పోయేలా చేస్తుందన్నారు. అలోవేరాతో కూడిన కొబ్బరి ఆధారిత హెయిర్ ఆయిల్ విశిష్ట మిశ్రమం మీ శిరోజాల్లోకి పది పొరల దాకా చొచ్చుకుపోతుందన్నారు.

భీమిలి సమగ్ర అభివృద్ధికి లోకల్ మేనిఫెస్టో

అసెంబ్లీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక లోకల్ మేనిఫెస్టోను ప్రకటించనున్నట్టు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఒక ఎలక్ట్రానిక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ విశాఖ - భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య ఉన్న భీమిలి అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్ లోని గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్లా భీమిలి నియోజకవర్గం అభివృద్ధికి అపార అవకాశాలున్న ప్రాంతమని చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి విశాఖకు వలసలు వచ్చిన వారు కూడా భీమిలి నియోజకవర్గంలోనే స్థిర నివాసం ఏర్పరచుకుంటున్న కారణంగానే రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో ఓటర్లు నమోద య్యారని పేర్కొన్నారు. టిడిపి, జనసేన, బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో రాష్ట్రానికి సంబంధించినదని, స్థానికంగా పరిష్కరించగలిగే సమస్యలను లోకల్ మేనిఫెస్టోలో పొందుపరుస్తానని చెప్పారు. పంచ గ్రామాల భూ సమస్య, ఇనాం భూ సమస్య, చిట్టివలస జూట్ మిల్లు కార్మికుల సమస్య వంటి అనేక అపరిష్కృత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని వివరించారు.

సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: శ్రీ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. మానవ సేవ మాధవ సేవ అనే సిద్ధాంతంను నమ్మి సేవ చేయాలన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల వేంపల్లానగర్లో గల శ్రీ సత్యసాయి సేవా సమితి సాయిరామ్ శంకర్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ వేసవిలో మన శరీరం డీహైడ్రేషన్కు లోనవుతుందని అందుకు ద్రవరూపంలో ఎక్కువగా తీసుకువాలని సూచనలు చేసారు.

సామయ్యవలసలో వైసిపి ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామీ వలస గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకులు ముత్తంశెట్టి అల్లుడు శ్రవణ్ కుమార్, స్థానిక వైఎస్ఆర్సీపీ నాయకులు, మండల స్థాయి నాయకులు గ్రామంలోని ప్రతి గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. మీకు మంచి జరిగితే ఓటు వేయమని అలాగే జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోను కూడా ప్రతి గడపగడపకు వివరిస్తూ చేయూత ద్వారా ప్రతి ఏడాది మహిళలకు 37,500 లబ్ధి చేకూరుతుందన్నారు. రైతన్నలకు మరింత రెట్టింపు రైతు భరోసా, నవరత్నాలు మేనిఫెస్టో గురించి ప్రతి గడపగడపకు వివరించడం జరిగింది. ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న ప్రతి నిర్మాణం కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు అంజూరి అప్పారావు, నాయకులు ఎక్స్ సర్పంచ్ పల్లి మహేష్, ఎంపీటీసీ పాలూరి స్వామినాయుడు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాయింట్ వెంచర్ను ఏర్పాటు చేయనున్న నెస్లే ఇండియా, డాక్టర్ రెడ్డీస్

విశాలాంధ్ర - విశాఖపట్నం: వినియోగదారులకు వినూత్న న్యూట్రాస్యూటికల్ బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నెస్లే ఇండియా లిమిటెడ్ (నెస్లే ఇండియా), డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థలు (డాక్టర్ రెడ్డీస్) ఒక జాయింట్ వెంచర్ను (జేవీ కంపెనీ) ఏర్పాటు చేయడానికి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండింటి సంయుక్త భాగస్వామ్యాన్ని జేవీ పార్ట్నర్స్ పిలుస్తారన్నారు. ఈ భాగస్వామ్యం భారత్లో డాక్టర్ రెడ్డీస్ బలమైన, స్థిరపడిన వాణిజ్య బలాలతో నెస్లే హెల్త్ సైన్స్ (ఎన్ హెచ్ ఎస్సీ) విటమిన్, మినరల్స్, హెర్బల్స్, సప్లిమెంట్స్తో పాటు ప్రపంచ ప్రసిద్ధ శ్రేణి పోషకాహార ఆరోగ్య పరిష్కారాలను తీసుకువస్తుందన్నారు. ఈ జాయింట్ వెంచర్ గురించి నెస్లే ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ నారాయణన్ మాట్లడుతూ "మేము డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ జాయింట్ వెంచర్లోకి ప్రవేశిస్తున్నామని ప్రకటించడానికి చాలా సంతోషంగా ఉన్నామన్నారు.

దేవిపురంలో ఇండిపెండెంట్ గుంటూరు అన్న సమారాధన

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుంటూరు వెంకట నరసింహారావు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. సతీమణి భారతి సహా కుటుంబ సభ్యులు మద్దతుదారులు అభిమానులతో కలిసి పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. పల్లెలు పట్టణాల్లో కలియ తిరుగుతూ తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం బాటజంగాలపాలెం, గాలి భీమవరంలో ఇంటింటి ప్రచారం చేపట్టిన నరసింహారావు ప్రజలను కలిసి మన పెందుర్తి మన అభివృద్ధి నినాదాన్ని వివరించారు. ప్రజల సమస్యలు తెలిసిన తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దేవిపురంలో అన్న సమారాధన నిర్వహించి భక్తులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండిపెండెంట్ అభ్యర్థిగా తనకు ప్రజల నుండి మంచి మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఉత్తరంలో టీడీపీ నుండి వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీకి చెందిన 53వ వార్డ్ శివనగర్ యూత్కు సంబంధించిన పలువురు నాయకులు, మహిళాలు, వైసీపీ నాయకుడు బత్తుల సంజీవ నాయుడు మంగళవారం ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి ఫ్యాను గుర్తుపై ఓటు వేసే విధంగా అందరికీ తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లంక భాస్కర్రావు, అంబటి శైలేష్, చంద్రమౌళి సాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫరూకీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఏక్యూజే విద్యాసంస్థల అధినేత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్ ఫరూకి జన్మదినం సందర్భంగా మంగళవారం వారి కార్యాలయంలో పార్టీ నేతలు శ్రేణులు మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు , కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ శ్రేణులు, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఇమ్యునైజేషన్ షెడ్యూల్ను ఖచ్చితంగా పాటించాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పిల్లలకు సరైన ఇమ్యునైజేషన్ షెడ్యూల్ను ఖచ్చితముగా పాటించాలని ప్రముఖ పిల్లల వైద్యులు, ఓమ్ని ఆర్కే ఆసుపత్రి ఎండి డాక్టర్ రాధాకృష్ణ కందుల సూచించారు. ప్రపంచ ఇమ్యునైజేషన్ వారం (ఏప్రిల్ 24-30) ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క ఎక్సపాండెడ్ ప్రోగ్రామ్ ఆన్ ఇమ్మునైజేషన్ (ఈపిఐ) 50వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మైలురాయి గ్లోబల్ ఇమ్యునైజేషన్ ప్రయత్నాల వారసత్వాన్ని గత ఐదు దశాబ్దాలుగా టీకా ద్వారా రక్షించబడిన లెక్కలేనన్ని జీవితాలను కమ్యూనిటీలకు గుర్తు చేస్తుందన్నారు. భారతదేశంలో, యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యుఐపి) 90 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలకు రోగనిరోధక శక్తిని విస్తరించడంలో విజయవంతమైందన్నారు. మొదటి సంవత్సరంలో కవరేజ్ ఎక్కువగా ఉన్నప్పటికీ, 1వ పుట్టినరోజు తర్వాత డ్రాప్ అవుట్ రేట్లు గణనీయంగా ఉంటున్నాయన్నారు.

అత్యున్నత భద్రత ప్రమాణాలతో స్కోడా కార్లు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో ప్రీమియం, భద్రతా పరంగా అత్యుత్తమ కార్లు అందించే సంస్థగా స్కోడా ఆటో ఇండియా నిలుస్తుందని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. స్కోడా అంటేనే నమ్మకమైన బ్రాండ్ అలాంటి ఈ బ్రాండ్ నుంచి 2022 అక్టోబర్ లో కుషాక్ ఎస్ యువీవచ్చిందన్నారు. ఆతర్వాత 2023 ఏప్రిల్ లో స్లావియా సెడాన్ వచ్చిందన్నారు. ఈ రెండు కార్లు భద్రతా ప్రమాణాల పరంగా అత్యున్నత స్థాయిలో ఉన్నాయన్నారు. ఇప్పుడు ఆ భద్రతా ప్రమాణాలను మరింత పెంచేందుకుస్కోడా ఆటో ఇండియా నడుం బిగించిందన్నారు. అందులో భాగంగా కుషాక్ స్లావియాలోని అన్ని వేరియంట్ లలో ఆరు ఎయిర్ బ్యాగులను ప్రవేశపెట్టిందన్నారు. కంపెనీ యొక్క ఎం వై 24 అప్డేట్ ద్వారా ల్యాండ్ మార్క్ విజన్ అయినటువంటిమేడిన్ ఇన్ ప్రమాణాలను స్కోడా అందిస్తుందని చెప్పారు.

రెడీ టూ డ్రింక్ గ్లూకాన్ డి యాక్టివర్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: సైన్స్ ఆధారిత ఎఫ్ఎంసీజీ కంపెనీ జైడస్ వెల్నెస్, గ్లూకాన్ పైలట్ లాంచ్తో ఎలక్ట్రోలైట్ ఎనర్జీ రెడీ-టు-డ్రింక్ (ఆర్టిడి) పానీయాల విభాగంలో తన ఐకానిక్ బ్రాండ్ గ్లూకాన్-డి ఆక్టివేటర్లను విస్తరించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల తీవ్రమైన వేగవంతమైన జీవనశైలి ప్రయాణాల వల్ల రెడీ టూ డ్రింక్ (ఆర్టీడీ) పానీలయాలకు డిమాండ్? పెరుగుతోందన్నారు. ప్రస్తుతం దీని మార్కెట్ విలువ రూ. 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. జైడస్ వెల్నెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తరుణ్ అరోరా ఈ ప్రొడక్ట్ లాంచ్ గురించి మాట్లాడుతూ రాబోయే 3-5 సంవత్సరాల్లో మా అమ్మకాలను రెట్టింపు చేయాలని మేము ప్లాన్ చేస్తున్నామన్నారు.

ముత్తంశెట్టికి తెలక కులస్తుల మద్దతు

విశాలాంధ్ర - భీమిలి: అవినీతికి ఆమడ దూరంలో ఉన్న వ్యక్తిని గెలిపించుకోవాలని భీమిలి తెలక కులస్తులు అధ్యక్షుడు అంబటి శంకరరావు అన్నారు. అంబటి శంకరరావు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో తెలక కులస్తులు వైసీపీలో చేరారు. 2019 మేనిఫెస్టోలో చేర్చిన ప్రతి పథకం నూటికి నూరు శాతం అమలు చేసారని 2024లో మేనిఫెస్టోకి ఆకర్షితులై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరామని భీమిలి నియోజకవర్గంలో అవంతి శ్రీనివాస్ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.